సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



3వ రోజుకు పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో పవిత్రోత్సవాల్లో 3వ రోజు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సప్తకలశ స్నపన వంటి కార్యక్రమాలు నిర్వహించారు.



పారిజాతగిరి హుండీ లెక్కింపు

జంగారెడ్డిగూడెం: వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించారు. 92 రోజులకు రూ. 7,90,846 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు.



తలంబ్రాల చిప్పలు బహూకరణ

ద్వారకాతిరుమల: వేంకటేశ్వరస్వామికి పెనుమంత్ర మండలం పాలమూరుకు చెందిన కూరపాటి మంగారావు కుటుంబం 78.9 గ్రాముల బంగారు తలంబ్రాల చిప్పలు బహూకరించారు.

వేగంగా భూహక్కు పత్రాల పంపిణీ

- ఫేజ్-2లో 1.18 లక్షల ఎకరాల సర్వే
- 12 మండలాల్లోని 53 గ్రామాల్లో రీ సర్వే
- ఇప్పటికే 13,180 భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి



వీరవాసరం మండలం అండలూరులో భూహక్కు పత్రాలు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

భీమవరం(ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో చేపట్టిన భూముల రీ సర్వే వేగంగా సాగుతోంది. సర్వే భూములకు సంబంధించి రైతులకు భూ హక్కు పత్రాలను అందజేస్తున్నారు. అందులో భాగంగా ఫేజ్-2 రీ సర్వే పూర్తి చేసి రైతులకు ఫేజ్-2 భూహక్కు పత్రాలు అందజేస్తున్నారు. ఫేజ్-2లో జిల్లాలో 12 మండలాల్లో 53 గ్రామాల్లో 1,18,950 ఎకరాలు సర్వే చేశారు. అందులో ప్రైవేటు భూమి 1.15 లక్షల ఎకరాలు కాగా, ప్రభుత్వ భూమి 3,950 ఎకరాలకు సర్వే పూర్తి చేశారు.

30,212 మంది రైతులకు భూహక్కు పత్రాలు

ఫేజ్ 2 భూముల రీసర్వేలో 30,212 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాల్సి ఉండగా 28,812 మందికి భూ హక్కు పత్రాలు సిద్ధం చేశారు. ఇంతవరకు 13,180 పత్రాలు రైతులకు పంపిణీ చేశారు. మిగిలిన పత్రాల పంపిణీ వేగంగా జరుగుతుంది. తహసీల్దార్లు, డిప్యూటి తహసీల్దార్ల పర్యవేక్షణలో వీఆర్వోలు రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్నారు.

ఫేజ్-1లో 6 వేల మందికి భూహక్కు పత్రాలు

ఫేజ్-1 భూ రీసర్వే జిల్లాలో 16 మండలాల్లో 16 గ్రామాల్లో సర్వే చేశారు. 6 వేల మంది రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పత్రాలు అందించారు.



ఆకివీడు మండలం తరటవలో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

రైతుల హర్షం

భూములను ఉచితంగా సర్వే చేసి భూహక్కు పత్రాలు అందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూముల విస్తరణం, సరిహద్దుల విషయంలో రైతుల మధ్య గొడవలు రావడం, కోర్టుల్లో కేసులు వరకు వెళ్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భూ రీసర్వే తీసుకువచ్చి ఎవరికి ఇబ్బంది లేకుండా ఆధునిక పరికరాలతో పక్కగా సర్వే చేయించి రాళ్లు కూడా పాతించడం చాలా గొప్ప కార్యక్రమమని రైతులు చెబుతున్నారు.

ఫేజ్-3 లో 104 గ్రామాల్లో రీ సర్వే

జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉండగా ఇంతవరకు రెండు దశల్లో 69 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేశారు. ఫేజ్-3లో 20 మండలాల్లోని మరో 104 గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టారు. డిసెంబరు నాటికి జిల్లాలో రీ సర్వే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో ఫేజ్-2 సర్వే వివరాలు

మండలం	రైతులు	భూ హక్కు పత్రాలు	సర్వే చేసిన భూమి (ఎకరాలు)
తాడేపల్లిగూడెం	6,376	3,884	11,873.17
పెంటపాడు	8,796	5,455	15,596.54
అత్తిలి	7,525	4,487	12,084.47
భీమవరం	1085	1085	7,196.73
పాలకొల్లు	4,339	4,339	5,743.83
వీరవాసరం	7,510	5,045	11,320.90
ఉండి	5,539	914	13,117.98
పాలకోడేరు	8,021	2,317	12,657.17
కాళ్ల	2,430	1,392	8,214.45
గణపవరం	5,438	2,726	10,814.71
ఆకివీడు	3,714	378	9,148.98
తణుకు	771	763	1,182.54

30,212 మంది రైతులకు పత్రాల పంపిణీ



జిల్లాలో ఫేజ్-2 రీ సర్వే పూర్తి చేసి 30,212 మంది రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకున్నాం. ఫేజ్-1, ఫేజ్-2 రీ సర్వే పూర్తి చేసి 69 వేల మంది రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్నాం. ఫేజ్-3లో 20 మండలాల్లో 104 గ్రామాలే లక్ష్యంగా భూ సర్వే జరుగుతుంది. సర్వే పరికరాలు, అధికారులు, సిబ్బంది అంతా సిద్ధం చేసుకుని దశల వారీగా వేగంగా సర్వే పూర్తి చేసి వెంటనే భూహక్కు పత్రాలు రైతులకు అందిస్తున్నారు.

– పి.ప్రశాంతి, కలెక్టర్

గోడౌన్లకు స్థల సేకరణ వేగవంతం చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): మల్టీ పర్పస్ గోడౌన్ల నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి గొడౌన్‌కు స్థల సేకరణ, రీ సర్వే, ఎలక్షన్, హౌసింగ్, జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అంశాల వారీగా తహసీల్దార్లకు, ఎంపీడీఓలకు, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు అందజేశారు. మల్టీ పర్పస్ గోడౌన్లకు స్థల సేకరణ వేగవంతం చేయాలన్నారు. ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తి చేశామని చెప్పారు. జిల్లాలో ఓటర్ జాబితాకు సంబంధించి అందిన క్లెయిమ్స్, అభ్యంతరాలు పక్కాగా పరిశీలన చేస్తున్నామన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో నివసిస్తున్న ఓటర్లు ఏ ప్రాంతాల నుంచి వచ్చారో వివరాలు సేకరించి వారికి అనువైన పోలింగ్ స్టేషన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. గృహ నిర్మాణం పనుల ప్రగతిపై ఆరా తీశారు. పనులు మరింత వేగవంతంగా చేసి మెరుగైన ఫలితాలు చూపాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారి కృష్ణవేణి, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, హార్టికల్చరు అధికారి ఏ.దుర్గేష్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.డి మహేశ్వరరావు, సీపీవో కె.శ్రీనివాస రావు, డీసీవో ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నిషేధిత మందులు అమ్మితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ లేబర్ అధికారి డాక్టర్ ఎ.లక్ష్మి

భీమవరం ప్రకాశం చౌక్: 18 సంవత్సరాలోపు బాల బాలికలకు నిషేధిత మందులు అమ్మవద్దని జిల్లా ఇన్‌ఛార్జ్ లేబర్ అధికారి, నరసాపురం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డాక్టర్ ఎ.లక్ష్మి అన్నారు. భీమవరం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భవనంలో మందుల షాపుల యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందుల షాపు, పాన్ షాపు యజమానులతో నిషేధిత మందులు, మత్తు పదార్థాల అమ్మకాల నిషేధంపై వివరిస్తూ అవగాహన కల్పించామన్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సమితి నిర్దేశించిన ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికలోని అంశాలను వివరించామన్నారు. 18 సంవత్సరాలలోపు బాల బాలికలకు షెడ్యూల్ హెచ్, హెచ్ 1, ఎక్స్ వంటి కేటగిరి మందులు అమ్మరాదన్నారు. పాన్‌పరాగ్, గుట్కా, ఖైనీ వంటి పదార్థాల అమ్మకాలు నిషేధమని చెప్పారు. సమావేశంలో ఎస్ఈబీ డీఎస్‌టీ కె.కోటేశ్వరరావు, భీమవరం అసిస్టెంట్ లేబర్ అధికారులు ఎస్.దుర్గారావు, కాశీ శివ నాగమల్లేశ్వరరావు, మందుల షాపు ప్రెసిడెంట్ ఎ.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంచార పశు వైద్యశాలలో ఉద్యోగాలు

కాళ్ల: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల ఆధ్వర్యంలో ఈఎంఆర్ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ పరిధిలో డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం వెటర్నరీ అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళ్ళ, ఉండి, భీమవరం, తణుకు, పెరవలి, నర్సాపురం, అత్తిలి, పాలకొల్లు, మొగల్తూరు, పట్టేంపాలెం, యలమంచిలి, మార్టేరు, ఆచంట ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. 37 సంవత్సరాల లోపు వయసు ఎస్ఎస్‌సీ పాసై, డ్రైవింగ్ లో 2 నుంచి 3 సంవత్సరాల అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9110595889 నెంబరులో సంప్రదించాలని సంచార పశువైద్యశాల జిల్లా మేనేజర్ శివతేజ కోరారు.

ఉత్తమ పారిశుధ్య కార్మికుడు నాగరాజుకు సత్కారం



తాడేపల్లిలో నాగరాజును సత్కరిస్తున్న అధికారులు

భీమడోలు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా భీమడోలు పంచాయతీలోని బంగారు నాగరాజు ఉత్తమ పారిశుధ్య కార్మికుడిగా ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన నాగరాజు గత 15 ఏళ్లుగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను చేస్తూ అధికారుల మన్ననలు అందుకుంటున్నాడు. గుంటూరు జిల్లాలోని తాడేపల్లిలో సోమవారం సఫాయిమిత్ర సురక్షా శిబిరంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ కార్మికుడిగా ఎంపికైన బంగారు నాగరాజును రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ ప్రిన్సిపల్ కార్యదర్శి బుడితి రాజ శేఖర్‌తో పాటు ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు. అతని సేవలను ప్రశంసించి జ్ఞాపిక అందించారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని అభినందించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను ప్రజా భాగస్వామ్యంలో ముమ్మరంగా చేపడుతున్నాయన్నారు. నాగరాజును సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, గ్రామ కార్యదర్శి ఎన్.ఠాగూర్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

కృషి బ్యాంక్ కేసులో వారెంట్ ముద్దాయి అరెస్టు

పాలకొల్లు సెంట్రల్ : రెండు రోజులు క్రితం పాలకొల్లులో వారెంట్ ముద్దాయిని హైదరాబాద్ సీఐడీ పోలీసులు అరెస్టు చేయడం సంచలనం రేపింది. 2001లో హైదరాబాద్‌లో కృషి బ్యాంక్‌లో జరిగిన అవకతవకలపై ఆ బ్యాంక్ డైరెక్టర్ కాగితాల శ్రీధర్‌ను సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. సుమారు రూ.36 కోట్ల వరకూ ఈ కేసులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. నాన్ బెయిల్‌బుల్ వారెంట్‌పై ఉన్న శ్రీధర్ గత కొద్ది కాలంగా పాలకొల్లులో తమ సమీప బంధువుల ఇంట్లో ఉంటున్నట్లు గుర్తించిన హైదరాబాద్ సీఐడీ పోలీసులు శనివారం అరెస్ట్ చేసినట్లు సమాచారం. నాంపల్లి కోర్టులో ఈ కేసు విచారణలో ఉంది.

స్వర్ణయుగాన్ని తలపిస్తున్న విద్యారంగం

ఏపీ స్కూల్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్

ఆకివీడు: ప్రస్తుత విద్యా రంగం స్వర్ణయుగాన్ని తలపిస్తుందని ఏపీ స్కూల్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్ చెప్పారు. మండలంలోని పెదకాపవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడులో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, అదనపు తరగతి గదులు, ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీ, జిమ్ తదితర వాటితో పాటు క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేసిందన్నారు. రాష్ట్రంలో 40 వేల పాఠశాలలలో నాడు-నేడు పథకం ద్వారా మౌలిక వసతులు కల్పించి, రూ.18 వేల కోట్ల బడ్జెట్‌తో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. బాధ్యతతో పనులు జరుగుతాయనే టెండర్ విధానానికి స్వస్తి చెప్పి.. పాఠశాలల పరిధిలో పనులు చేయించేలా నిధులు కేటాయిస్తున్నామన్నారు.

మన సొమ్ముతో చేస్తున్న పనుల పట్ల మన పర్యవేక్షణ కూడా ఉండాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కావలసిన వసతులన్నీ సమకూర్చుతుందని చెప్పారు. ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇవన్నీ ఒకటైతే విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రుల శ్రద్ధ అవసరమని భాస్కర్ చెప్పారు. ఓఎస్‌డీ కఠారి వెంకట కృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలో తల్లిదండ్రులు వారి చదువును పట్టించుకుంటే, వారు ఉన్నతులైన తరువాత తల్లిదండ్రుల్ని పట్టించుకుంటారని చెప్పారు. ప్రాథమిక దశలోనే విద్యార్థులు చదువులో బలమైన పునాదులు వేయాలన్నారు. ఉపాధ్యాయులపైనే విద్యార్థుల భవిష్యత్‌ను వదిలివేయకూడదన్నారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) మాట్లాడుతూ విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్వీ రమణ, సర్వశిక్షాఅభియన్ ఏపీసీ శ్యామ్‌సుందర్, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, హైస్కూల్ హెచ్ఎం శ్రీకాళహస్తేశ్వరరావు, ఉప సర్పంచ్ పాతపాటి పద్మావతి, కఠారి రామకృష్ణ, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



పెదకాపవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడులో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఏపీ స్కూల్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్

స్పందనలో ప్రతి అర్జీ పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



స్పందనలో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి ఆమె హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని సూచించారు. స్పందన పరిష్కారం చేసేటప్పుడు ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఫొటో అప్‌లోడ్ చేయాలని, సమస్య పరిష్కారం కాకముందు ఉన్న ఫొటో, పరిష్కారం అయిన తర్వాత ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం, సక్రమంగా సమస్య పరిష్కారం లేకపోతే మళ్లీ మళ్లీ అదే సమస్యలపై ప్రజలు స్పందనకు వస్తారన్నారు. సమస్య పరిష్కారం కాలేదని స్పందనకు వస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పందనలో 264 దరఖాస్తులు వచ్చాయని వాటిని ఆయా శాఖలకు అందజేశామని వాటిని వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీవో కె.కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన ఫిర్యాదులు

- తన కొద్దిపాటి ఆస్తి కొడుకుకు రాశానని.. అనారోగ్యంతో అతను మరణించడంతో కోడలు కనీసం భోజనం కూడా పెట్టడంలేదని న్యాయం చేయాలని నరసాపురం మండలం పెదమైనవానిలంక నివాసి తిరుమాని కనకరత్నం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- తమకు పెళ్ళయ్యి ఐదు సంవత్సరాలు అయిందని.. స్థలం కోసం దరఖాస్తు చేసి చాలా కాలమైందని స్థలం మంజూరు చేయాలని అత్తిలి మండలం పాలూరు గ్రామ నివాసి వేగి భాగ్యలక్ష్మీ కలెక్టర్‌ను కోరింది.
- డ్రైనేజీ సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నామని వ్యాధుల బారిపడుతున్నారని డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని పాలకొల్లు మండలం తిల్లపూడి పాటిగరువుకు చెందిన దిడ్ల మాణిక్యాలరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా

ఉండి: ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి తెలిపారు. సోమవారం ఉండి మండలం మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభం కాబోతున్న ఈ కార్యక్రమాన్ని ముందుగా పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా ఉండి మండలం మహదేవపట్నంలో ఏర్పాటు చేశారు. ముందుగా ఏఎస్ఎంలు ద్వారా నిర్వహించిన ఇంటింటి సర్వే పరీక్షల రిపోర్టు ఆధారంగా సోమవారం నిర్వహించిన క్యాంపులో గైనకాలజిస్టు, జనరల్ ఫిజీషియన్, చిన్నపిల్లల వైద్య నిపుణులైన డాక్టర్లు పాల్గొని క్యాంపునకు హాజరైన వారిని పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటికీ సర్వే నిర్వహించి అనారోగ్యానికి సంబంధించిన ప్రాథమిక పరీక్షలు నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ డీ ఉమామహేశ్వరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కీర్తి, అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ బీ.భానునాయక్, ఎంపీడీఓ ఏవీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మెట్టకు మణిహారం

- శరవేగంగా ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే
- జిల్లాలో 72 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారి



జోరుగా ఖమ్మం -దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు

చింతలపూడి: ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రెండేళ్లలో హైవే నిర్మాణం పూర్తి చేయడానికి పనుల వేగాన్ని పెంచారు. హైదరాబాద్-విశాఖపట్నం మధ్య దూరం తగ్గించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. హైదరాబాద్- విశాఖపట్టణం మధ్య 56 కిలోమీటర్ల దూరం తగ్గడమేకాక ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. 162 కిలోమీటర్ల నిడివి గల ఈ రహదారిలో 8 నుంచి 10 ఇంటర్ చేంజ్ పాయింట్లు ఉంటాయి. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో కార్లు, 100 కిలోమీటర్ల వేగంతో భారీ వాహనాలు ప్రయాణించేలా హైవే నిర్మాణం చేపడుతున్నారు. కేంద్ర ఉపరితల రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలు గత ఏడాది ఫిబ్రవరిలో విజయవాడలో జిల్లాలో రెండు ఫేజ్‌లలో చేపట్టనున్న జాతీయ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఏలూరు జిల్లాలో 72 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. 70 మీటర్ల వెడల్పుతో ఎకనామిక్ కారిడార్‌గా ఈ రహదారిని వర్గీకరించారు.

2024 చివరికల్లా అందుబాటులోకి..

రెండు దశల్లో నిర్మించినున్న ఈ ప్రాజెక్టును పూనెకు చెందిన బెకం ఇన్‌ఫ్రా సంస్థ చేపట్టింది. 2024 చివరికి ఈ రహదారి అందుబాటులోకి రానుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించారు. కేంద్ర మంత్రులతో చర్చలు జరిపి భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా మంజూరైన ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనాలను వివరించడమే కాక తెలంగాణ రాష్ట్రంతో కాకినాడ పోర్ట్ అనుసంధానం కీలకమైందని కేంద్రం పెద్దలను ఒప్పించారు. ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సైతం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు మెరుగైన పరిహారం అందించడంలో కీలకంగా వ్యవహరించారు. ఖమ్మం జిల్లా కృష్ణాపురం, తుంబూరు వద్ద నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ఈ జాతీయ రహదారి ప్రవేశిస్తుంది. చింతలపూడి మండలం, రేచర్ల నుంచి గుర్వాయిగూడెం వరకు 4 లేన్ల రహదారి నిర్మాణానికి 569.37 కోట్లు, గుర్వాయిగూడెం నుండి దేవరపల్లి వరకు రూ.711.94 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. దీంతో దశాబ్దాలుగా వెనుకబడిన మెట్ట ప్రాంతంలో నేషనల్ హైవే అందుబాటులోకి రానుండడంతో రవాణా సదుపాయాలు మెరుగయ్యే అవకాశం ఉంది. రహదారి కోసం మొత్తం 1,411 ఎకరాల భూమి అవసరమవుతుంది. అందులో 114 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 1,297 ఎకరాలు రైతుల నుంచి సేకరించనున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 4,609 కోట్ల అంచనాలతో మొత్తం ఆంధ్ర, తెలంగాణలో కలిపి 5 దశల్లో రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు.



తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య పొలాల్లో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి

మెట్టకు మంచి రోజులు



గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే జిల్లాలోని మెట్టప్రాంతమైన చింతలపూడి, పోలవరం, నియోజకవర్గాలకు రవాణా పరంగా మంచి రోజులు వస్తాయి. హైదరాబాద్, విశాఖపట్నానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో అటు జిల్లా కేంద్రం ఏలూరు నుండి చింతలపూడి, ఏలూరు, జంగారెడ్డిగూడెం పట్టణాల మీదుగా ఆర్టీసీ మరిన్ని బస్సులు నడిపే అవకాశం ఉంది. దీంతో రవాణతో పాటు వ్యాపారాలు కూడా పెరిగి ఆర్థికంగా, పారిశ్రామికంగా, వ్యాపారపరంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

ఉన్నమట్ల ఎలీజా, శాసన సభ్యులు, చింతలపూడి

50 శాతం రాయితీతో గొర్రెలు, మేకల యూనిట్లు

ఏలూరు (టూటౌన్): జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో గొర్రెలు-మేకల యూనిట్లు మంజూరు చేయనున్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఔత్సాహిక రైతులను, నిరుద్యోగులను ప్రోత్సహించేందుకు గ్రామీణ స్థాయిలో రూ.50 లక్షల వరకూ సబ్సిడీతో కూడిన గొర్రెలు,మేకల యూనిట్లను మంజూరు చేస్తుందన్నారు. ఒక్కో యూనిట్‌లో 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల వరకూ మంజూరు చేస్తామన్నారు. రూ.కోటి అంతకు మించి ప్రాజెక్టు విలువ ఉంటే గరిష్టంగా రూ.50 లక్షల వరకు రాయితీ ఇస్తామన్నారు. కోళ్ల అభివృద్ధి పథకంలో రూ.50 లక్షల వరకూ యూనిట్ మంజూరు చేస్తామన్నారు. గరిష్టంగా రూ.25 లక్షల వరకూ రాయితీ ఇస్తామన్నారు. పందుల పెంపకానికి రూ.60 లక్షల వరకూ యూనిట్ మంజూరు చేస్తామన్నారు. గరిష్టంగా రూ.30 లక్షల వరకూ రాయితీ ఇస్తామన్నారు. పశు గ్రాసం యూనిట్లకు గరిష్టంగా రూ.50 లక్షల రాయితీ ఇస్తామన్నారు. సైలేజ్ తయారీ యూనిట్, పశుగ్రాస దిమ్మల తయారీ యూనిట్, సమీకృత దాణా తయారీ యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. వీటికి రూ.కోటి వరకూ రుణ సహాయాన్ని అందిస్తామని జేడీ నెహ్రూబాబు తెలిపారు.

పోలీసు స్పందనలో 22 ఫిర్యాదులు

సాక్షి, భీమవరం: భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 22 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ యు.రవిప్రకాష్, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో వరకట్నం వేధింపులు, సరిహద్దు తగాదాలు, సివిల్ వివాదాలకు సంబంధించినవి ఉన్నాయి. ఎస్పీ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.

గణనాథులకు ఘన వీడ్కోలు



నరసాపురం రూరల్: యర్రంశెట్టిపాలెంలో ఊరేగుతూ..



తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో ఊరేగింపులో వీకర్స్ కాలనీ గణేశుడు



తాడేపల్లిగూడెం రూరల్: కళాకారుల నృత్య ప్రదర్శన



లింగపాలెం: మఠంగూడెంలో ట్రాక్టర్‌పై ఊరేగుతున్న వినాయకుడు



కాళ్ల: దొడ్డనపూడిలో గణనాథుడిని నిమజ్జనానికి క్రేన్‌లో తరలిస్తున్న దృశ్యం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదో రోజు సోమవారం కొనసాగాయి. పలు చోట్ల ఉత్సవ వేదికల వద్ద ప్రత్యేక పూజల అనంతరం తీన్మార్ వాయిద్యాలు, చిన్నారులు, యువకుల నృత్యాల నడుమ గణనాథుల విగ్రహాలను ఘనంగా ఊరేగించి వీడ్కోలు పలికారు.

– సాక్షి, నెట్‌వర్క్

నేటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/వీరవాసరం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడలకు సంబంధించి అండర్–14, అండర్–17 జిల్లా జట్లను ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో ఎంపిక చేయనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డీ.బాబురాజేంద్రప్రసాద్, పీఎస్ఎన్ మల్లేశ్వరరావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఏలూరు కేపీడీటీ హైస్కూల్‌లో హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక జరుగుతుందని, వివరాలకు రమేష్ రాజును 98853 24848 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అలాగే భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం స్కూల్‌లో రోప్ స్కిప్పింగ్, యోగ, టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని, వివరాలకు జి.శేఖర్‌రాజును 9848790115 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. 27న శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ జట్టు ఎంపిక పోటీలు జరుగుతాయని, కుర్దూస్‌ను 98851 58366 నంబర్‌లో, వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలకు సంబంధించి మల్లేశ్వరరావును 80741 53923 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. 29న రోల్ బాల్ జట్ల ఎంపిక తణుకు మున్సిపల్ స్కేటింగ్ రింగ్‌లో జరుగుతాయని, వివరాలకు లావణ్యను 96423 31332 నంబర్‌లో, తణుకు మహిళా డిగ్రీ కళాశాలలో జరిగే షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికకు సంబంధించి సతీష్ కుమార్‌ను 98496 66223 నంబర్‌లో, పెదతాడేపల్లి భారతీయ విద్యా భవన్‌లో జరిగే అథ్లెటిక్స్ జట్ల ఎంపికకు సంబంధించిన వివరాలకు భాస్కర్‌ను 94903 50932 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే అండర్ 14 జట్లకు సంబంధించిన విద్యార్థులు 2010 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని, అండర్ 17 జట్లకు సంబంధించిన విద్యార్థులు 2007 జనవరి 1వ తేదీకి ముందు జన్మించిన వారై ఉండాలని సూచించారు.

కళాశాల విద్యార్థులకు ఏలూరులో..

జూనియర్ కళాశాలల విద్యార్థులకు అండర్–19 జిల్లా జట్ల ఎంపిక ఏలూరులోని సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే.జయరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అండర్–19 బాలికల బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ జట్ల ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఖనిజ సంపద సద్వినియోగంతోనే ముందంజ

సాక్షి, భీమవరం: దేశంలోని ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో ముందంజలో నిలుస్తామని పలువురు నిపుణులు అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నానో టెక్నాలజీ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంఈసీపీ) పేరిట రెండు రోజుల సదస్సు నిర్వహించగా తొలిరోజు సోమవారం నానో టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ హెడ్ ఆర్.వేణురెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఐటీ చెందిన శాస్త్రవేత్త డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లో లిథియం మినరల్స్ అపారంగా లభ్యమవుతున్నాయని గత ఏడాది గుర్తించారన్నారు. దీంతో ప్రపంచంలో అతిపెద్ద పారిశ్రామికవేత్తలు కూడా భారతదేశంలో పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, భువనేశ్వర్ ఐఐటీ ప్రొఫెసర్ కె.విజయ్ కృష్ణ, తిరుపతి ఐఐటీకి చెందిన ఎం.రవిశంకర్ మాట్లాడుతూ కాఫర్‌ను నానో మెటీరియల్‌గా అభివృద్ధి చేస్తే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. పరిశోధనల్లో ఇంజనీరింగ్ మెటీరియల్స్ మరింత ఎక్కువ స్థాయిలో ఉపయోగించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమష్టి కృషితో జరిపే ప్రయోగాలు విజయవంతం అవుతాయనడానికి చంద్రయాన్–3 నిదర్శనమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, సదస్సు డైరెక్టర్, ఆర్అండ్‌డీ డీన్ పీఏ రామకృష్ణంరాజు, రాజేష్, ఎంవీ సోమేశ్వరరావు, పి.భవాని, వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రవికిరణ్‌శాస్త్రి

‘గుర్రం జాషువా’ పురస్కారానికి నలుగురి ఎంపిక

నూజివీడు: మహాకవి గుర్రం జాషువా జాతీయ సాహితీ పురస్కారానికి నూజివీడుకు చెందిన ప్రముఖ అభ్యుదయ కవి శిఖా ఆకాష్, ప్రముఖ రంగస్థల కళాకారులు చంద్రశేఖర్, ఎస్ఆర్ఆర్ హైస్కూల్ తెలుగు అధ్యాపకులు ఎంఎన్‌వీ ప్రసాద్, ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జడ సుబ్బారావు ఎంపికయ్యారు. బహుజన రచయితల వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 28న మహాకవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని గుర్రం జాషువా పేరుతో జాతీయ సాహితీ పురస్కారాలను అందజేయనుంది. ఈ పురస్కారాలకు నూజివీడు నుంచి ఈ నలుగురిని ఎంపిక చేసినట్లు వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోని తెలిపారు. వీరికి ఈనెల 28న ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల ప్రజాపరిషత్ హాల్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో మహాకవి గుర్రం జాషువా జాతీయ సాహితీ పురస్కారాన్ని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు చేతుల మీదుగా అందిస్తామని వివరించారు.

బీసీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం

ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీహైస్కూల్లో చదువుతూ బీసీ బాలుర హాస్టల్లో ఉంటున్న విద్యార్థి అదృశ్యమైన ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్లో సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరానికి చెందిన బోయిన హరికృష్ణ (12) ముదినేపల్లి బీసీ బాలుర హాస్టల్లో ఉంటూ జెడ్పీ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. వినాయకచవితి పండుగకు గ్రామానికి వెళ్లి శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. అనంతరం హాస్టల్‌కు రాకపోవడంతో వార్డెన్ సురేష్‌కుమార్ విద్యార్థి బంధువులను ఆరా తీశారు. రెండు రోజులుగా అతని ఆచూకీ తెలియకపోవడంతో విద్యార్థి బంధువులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకటకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడు హరికృష్ణ

పాలకోడేరులో భారీ వర్షం

సాక్షి, భీమవరం: జిల్లాలో సోమవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. పాలకోడేరులో అత్యధికంగా 46.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భీమవరంలో 38.6, కాళ్లలో 32.2, ఉండిలో 26.2, ఆకివీడులో 22.4, పాలకొల్లులో 23.4, ఇరగవరంలో 14.2, వీరవాసరంలో 14.0, యలమంచిలిలో 10.8, ఆచంటలో 10, పోడూరులో 8.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలకు సత్కారం

ఏలూరు (టూటౌన్): గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన 36వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2023లో ఏలూరుకు చెందిన క్రీడాకారులు తమసత్తా చాటడం అభినందనీయమని రిటైర్డ్ హెచ్‌ఎం, సామాజిక కార్యకర్త జల్లా వీరభద్రరావు అన్నారు. ఈ పోటీల్లో ఏలూరు జిల్లాకు చెందిన కేఎస్ఎస్ సాహిల్ బాబు అండర్–16 బాలుర విభాగం 100 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర ఉత్తమ అథ్లెట్ అవార్డును అందుకున్నాడు. గత మూడేళ్లుగా సాహిల్ బాబు ఈ అవార్డును దక్కించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఎన్ఆర్‌పేట ఎస్ఏజీ ట్రెనింగ్ అకాడమీలో సోమవారం క్రీడాకారులను సత్కరించారు. అండర్–16 బాలుర హెక్సాథ్లెన్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన శ్యామ్ సాయి నితీష్, అండర్–18 బాలుర 800 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్ సాధించిన సీహెచ్ శంకర్, అండర్–16బాలుర విభాగం మిడ్లేరులో బ్రాంజ్ మెడల్ సాధించిన టి.చరణ్ మణికంఠలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు సాహిల్ బాబుకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోచ్ దేవరపల్లి ప్రసాద్, సీనియర్ అథ్లెట్ అన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర కుస్తీ పోటీల్లో ఇద్దరికి కాంస్యం

దెందులూరు: కృష్ణా జిల్లా నున్న పాఠశాలలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 కుస్తీ పోటీల్లో మేదినరావుపాలెం, పోతునూరు హైస్కూళ్ల విద్యార్థులు సత్తా చాటారు. మేదినరావుపాలెం విద్యార్థి ఆర్.శాంతిదీప్, పోతునూరు విద్యార్థిని లాస్య బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీడీలు రవి, కృష్ణారావులను సర్పంచ్‌లు ఎం.దుర్గాకుమారి రాజు, బోదుల స్వరూప్, ఎంఈఓ–2 కే.అన్నమ్మ, మేదినరావుపాలెం హెచ్‌ఎం హరిసీతారామయ్య అభినందించారు.

మత్స్యకార ప్రాంతాలకూ శ్రీవారి ధర్మప్రచార రథం

ద్వారకాతిరుమల: మత్స్యకార, వెనుకబడిన తరగతులు, తెగలు నివసించే ప్రాంతాల్లో శ్రీవారి ధర్మ ప్రచార రథం పర్యటనలు జరపాలని ఆలయ ధర్మకర్తల మండలి తీర్మానించింది. శ్రీవారి కొండపైన పద్మావతి కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశంలో స్వామివారి ప్రధాన ఆలయంతో పాటు, ఉప, దత్తత దేవాలయాలు, అనుబంధ సంస్థల ఆదాయ, వ్యయాలతో పాటు పలు అభివృద్ధి పనులకు ఆమోదముద్ర వేశారు. దీనిలో భాగంగా రాష్ట్ర దేవదాయశాఖ సూచనల మేరకు మత్స్యకార, వెనుకబడిన తరగతులు, తెగలు నివసించే ప్రాంతాల్లో ధర్మప్రచార రథం పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్స్ తయారు చేయడం, విస్తృత ప్రచారం జరపడం, భజన బృందాలను ఏర్పాటు చేయడం, అలాగే ప్రసాద వితరణ వంటి అంశాలను తీర్మానించారు. అలాగే ఈ ఏడాది నవంబర్ 20న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో శ్రీవారి కల్యాణాన్ని జరిపించేందుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరించుటకు తీర్మానించారు.

సంగీత కళాశాల ఏర్పాటుకు కమిటీ

క్షేత్రంలో సంగీత కళాశాల స్థాపించేందుకు సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీని ఏర్పాటు చేశారు. వారిచ్చే నివేదిక ఆధారంగా కళాశాలను స్థాపించాలని నిర్ణయించారు. ఆలయ ఈశాన్య భాగములో కోనేరు నిర్మించి, ఆ పరిసర ప్రాంతాల్లో రూ. 5.80 కోట్లతో గ్రానైట్ ఫ్లోరింగ్ చేసేందుకు, నూతన షాపింగ్ కాంప్లెక్స్ మధ్య భాగాన్న రూ. 39.90 లక్షలతో టెన్సిల్ ఫేబ్రిక్ రూఫింగ్ ఏర్పాటుకు రూపొందించిన అంచనా వ్యయాలను ఆమోదించారు. ప్రస్తుతం అమలులో ఉన్న కనీస శాశ్వత విరాళం రూ.2,116లను రూ.5,116లకు పెంచాలని తీర్మానించారు. దేవస్థానం అనుమతిగల షాపుల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ స్థానంలో మొక్కజొన్న స్టార్చ్‌తో తయారు చేసిన బాటిల్స్‌(ఒక్కో బాటిల్‌ను రూ.40) విక్రయించాలని తీర్మానించారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ వంకా



అమరావతిలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: శాసనమండలి సమావేశాలలో భాగంగా సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాత్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని, ప్రధానంగా తణుకు నియోజకవర్గంలో పలు సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌తో చర్చించారు. అలాగే తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలిసిస్ యూనిట్‌కు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా చెల్లించవలసి మొత్తాన్ని చెల్లించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న తెన్నేటి జగ్జీవన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇటీవల ప్రమాదంలో మరణించిన మోటూరి శివ కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు వైఎస్ఆర్ బీమాలో భాగంగా రూ. 10 వేలు మట్టిఖర్చుల నిమిత్తం సోమవారం 13వ వార్డు ఇంచార్జి తెన్నేటి జగ్జీవన్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ శివ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ సూర్య, వెల్ఫేర్ సెక్రటరీ కె.రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న కర్రి నాగేశ్వరరావు, అంగన్‌వాడీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాడేపల్లిగూడెం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు జవ్వాది శ్రీనులు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. న్యాయమైన కోర్కెలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో మడక రాజు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అంగన్‌వాడీలు సీహెచ్ శ్రీదేవి, డి.విజయలక్ష్మి, రాణి, అరుణ, పతివాడ నాగేంద్రబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత దీన్ దయాళ్



దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి సురేష్‌రెడ్డి, బీజేపీ జాతీయ కౌన్సిల్ నాయకులు కర్రి ప్రభాకర్ బాలాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, బీఓసీ నాయకులు ఐనం బాలకృష్ణ, మారిశెట్టి నరసింహమూర్తి, చిట్యాల రాంబాబు, పాటే నాగేశ్వరరావు, రామగాని సత్యనారాయణ, తుమరాడ చిన్నా, పి.రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్: శ్రావణ శుద్ధ ఏకాదశి సందర్భంగా వాలమర్రు గ్రామంలో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు, అష్టదళ పాద పద్మారాధన పూజలు చేశారు. ఆలయ అర్చకస్వామి పెద్దింటి మణికిరణ్ బ్రహ్మత్వంలో భక్తులకు సేవలందించారు.

సదా మీ సేవలో..



జి. కొండేపాడులో ఫ్యామిలీ వైద్యసేవలలో భాగంగా మహిళను పరీక్షిస్తున్న ముదునూరు డాక్టర్ వి. పూజిత



ఇంటివద్ద వృద్ధురాలిని పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

- ఫ్యామిలీ డాక్టర్‌తో చేరువైన ఉచిత వైద్యం
- ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు
- గ్రామీణుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

పెంటపాడు: ఆరోగ్యమే మహా భాగ్యం అంటుంటారు పెద్దలు. అలాంటి ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దూరా భారం తగ్గించి ఇంటి ముంగిటకే వైద్య సేవలు తీసుకువచ్చింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో సరికొత్త అధ్యాయాన్ని నిలిచింది. బీపీ, సుగర్, జ్వరం, ఇతర సీజనల్ వ్యాధులకు రక్త పరీక్షలు చేయడమే కాకుండా ఉచితంగా మందులు అందిస్తోంది. 104 వాహనం ద్వారా ప్రతి గ్రామానికి వెళ్లి పీహెచ్‌సీ వైద్యులు సేవలు అందిస్తున్నారు. 14రకాల పరీక్షలను ఉచితంగా చేసి మందులు ఇస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పీహెచ్‌సీల్లో సరైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఉదయం ఆసుపత్రికి వెళ్తే డాక్టర్ ఓపీ చూసేంత వరకూ వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కు అయ్యేవి. చిన్న రోగులకూ రూ.వేలు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఉండేది. ఈ విధానానికి వైఎస్సార్ ప్రభుత్వం స్వస్తి పలికింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే పీహెచ్‌సీల్లో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చింది. మండలంలోని 22గ్రామాలు ఉన్నాయి. ఇందులో గ్రామాల్లో పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. ఒక్కో పీహెచ్‌సీలో 11మంది వరకూ సిబ్బంది పాటు డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతి రోజూ ఒక్కో గ్రామానికి వైద్యులు వెళ్లి సచివాలయాల పరిధిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇలా రెండు పీహెచ్‌సీల పరిధిలో ఈఏడాది మే నెల నుంచి ఆగస్టు వరకూ సుమారు 30వేల మందికి వైద్యం చేశారు. నెలకు రెండు పర్యాయాలు ఒక్కో గ్రామానికి వెళ్తున్నారు.

అందుబాటులో పీహెచ్‌సీ క్లినిక్‌లు

పెంటపాడు: గ్రామంలో ప్రతీ రెండు వేల జనాభాకు ఒక్క వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. అందులో ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయాల్లో సీహెచ్‌ఓలుగా నియమించారు. ప్రతీ పీహెచ్‌సీలో ఒక డాక్టర్ 104తో వచ్చి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గ్రామాల్లో ఓపీ చూసి ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల వద్దకు వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. అంతే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, కిశోర్‌బాలికలకు, బాలింతలు, గర్భిణులను పరిశీలించి అవసరమైన వైద్యం అందిస్తున్నారు. హెచ్‌బీ, ఆర్‌టీడీ, మలేరియా, డెంగీ, ఆర్‌బీఎస్, గర్భనిర్ధారణ, నీటి పరీక్షలు, క్లోరినైజేషన్, హెచ్‌బీఎస్, హెచ్‌ఐవీ, కంటి పరీక్షలు, పలు రకాల యూరిన్ పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధికప్రాధాన్యం ఇస్తోంది.

ఉచితంగా మందులు



ప్రతి నెలా మా గ్రామంలో రెండు సార్లు 104 వాహనం వస్తోంది. డాక్టర్లు వచ్చి ఆరోగ్యంపై అడిగి వైద్యం చేస్తున్నారు. ఉచితంగా మందులు అందించారు. ఈ సేవలు పొందుతూ సంతోషంగా ఉన్నాం. వైద్యఖర్చుల భారం తప్పింది. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు.

– యర్రా సుబ్బమ్మ, పడమరవిప్పర్రు

సేవలను సద్వినియోగం చేసుకోండి



నెలలో రెండు దఫాలు వైద్య సేవలు అందించేలా కార్యాచరణ చేపట్టాం. ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలు ప్రేవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో అవగాహన కల్పిస్తున్నాం. మొత్తం 70 రకాల మందులను రోగులకు అందిస్తున్నాం.

– వి. పూజిత, ముదునూరు రెండో మెడికల్ వైద్యాధికారి

సేవలకు ప్రత్యేక ధన్యవాదాలు



నేను కొన్నేళ్లు అనారోగ్యం వల్ల మంచానికే పరిమతమయ్యాను. పక్కన మనిషి తోడు ఉంటేనే కానీ ఏ పనీ చేసుకోలేను. వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా 104,108 సేవలతో పాటు, ఇంటికే వచ్చి ఆరోగ్యపరీక్షలు చేస్తున్నారు. ఎక్కడకు వెళ్లక్కర లేకుండా వైద్యం అందుతోంది. ప్రభుత్వ సేవలకు ధన్యవాదాలు.

– బాయిశెట్టి ప్రతాప్, విప్పర్రు

ఎలుక బొరియల గుర్తింపు



ఎలుక బొరియలను గుర్తించే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పడాల గ్రామంలో బొరియలు గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ తెరిచి ఉన్న బొరియల్లో ఎలుకలు ఉన్నాయని గుర్తించి, వాటిల్లో బ్రోమోడయోలిన్ ఎర మందును పెట్టాలని రైతులకు సూచించారు. పంచాయతీ కార్యాలయాల వద్ద ఎలుకల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేస్తారని, రైతులు వాటిని తీసుకుని, ఎలుకల బారి నుంచి వరి చేలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సన్నీ, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ మెయిన్ రోడ్డు ఫీడర్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 26వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం వివరాలను పట్టణంలో వెల్లడించారు. మెయిన్‌రోడ్డు, బస్ స్టాండ్ ఏరియా, తాలూకా ఆఫీస్ సెంటర్, నందిబగొమ్మ సెంటర్, శేషమహల్ సెంటర్ ఏరియాలలో సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వన్ టౌన్ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



సర్పంచ్ తెంటు జయలక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

పెంటపాడు: మండలంలోని పెంటపాడు, ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని సబ్ సెంటర్‌ల గ్రామాల్లో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గతంలో ఫ్యామిలీ హెల్త్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కేసులు కాకుండా ఆరోగ్యసురక్షలో మరో మారు ఇంటింటికి వెళ్లి ఆరోగ్యకార్యకర్తలు, ఆశవర్కర్లు పూర్తి సర్వే చేస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు ఎస్వీ రమణ, తోట రాజేష్, పూజిత, మౌనిక తదితరులు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చి ప్రత్యేక టీంలు తయారు చేశారు. ఆ టీం సభ్యుల ఆధ్వర్యంలో రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. దీర్ఘకాలిక రోగుల ఇబ్బందులను నమోదు చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల సబ్‌సెంటర్‌ల సిబ్బంది ఈ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇప్పటికే మండలంలో 70 శాతం సర్వే పూర్తి చేసినట్లు ఆయా ప్రాథమిక వైద్యాధికారులు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాలి



8వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న హెచ్‌ఎం, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్

అత్తిలి: దాతలు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి నుంచి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు హాజరయ్యే 20 మంది విద్యార్థులకు 'రాజ్‌కమల్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షకు సంబంధించి పరీక్ష ఫీజు రూ.2 వేలను అందించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ ఎంతో ఔదార్యంతో రాజ్‌కమల్ ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష ఫీజును చెల్లించారని, విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈపరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థి ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 12 వేలు చొప్పున ఐదేళ్ల పాటు ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. విద్యార్థులు చక్కగా చదివి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్ పర్సన్ ఆకుల మురళీకృష్ణ, ఎన్‌ఎంఎంఎస్ కోచ్ టీచరు శ్రీకాంత్, ఎస్ పురుషోత్తం, శ్రీహర్ష, మాధవ పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు విక్రయించరాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: రైతుల అవసరాలకు మించి ఎరువులను విక్రయించరాదని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ ఎరువుల డీలర్లకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ అధ్యక్షతన ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఎరువుల డీలర్లు ఈ-పాస్ యంత్రం ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ-పాస్, భౌతిక నిల్వలకు తేడా ఉండకూడదన్నారు. ఎరువుల డీలర్ల రికార్డులను, ఈ-పాస్ యంత్రాలను పరిశీలించడం జరిగిందన్నారు. డిసెంబరు 31వ తేది నాటికి ఎరువుల డీలర్లందరికీ అర్హత ప్రమాణాలు ఉండాలన్నారు. లేదంటే డిసెంబరు 31వ తర్వాత లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఎరువుల డీలర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గణనాథునికి ఘన వీడ్కోలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం అబ్బులు కొట్టు సెంటర్‌లో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని నెలకొలిపిన గణనాథుడిని సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆశీనులను చేశారు. అనంతరం కేరళల వాయిద్యాలు, కాళికా నృత్యాలు, పొడుగు మనుషులు, తీన్మార్ డప్పుల మధ్య స్వామివారిని యాలి ఆంజనేయులు వీకర్స్ కాలనీ, విమలానగర్, గాంధీ బొమ్మ సెంటర్, టీటీడీ కల్యాణమండపం రోడ్డు మీదుగా గోదావరి ఏలూరు కాలువకు తరలించారు. అనంతరం స్వామివారిని గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

అత్తిలి: నేడు మండలంలోగల గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. అత్తిలి మండలంలోగల రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు బ్రోమోడియోల్ మందును అందజేస్తారని, రైతులు ఎరను తీసుకుని ఎలుకబొరియలలో పెట్టి సమర్థవంతంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని కోరారు. ప్రస్తుతం చేలన్నీ ఈనిక దశకు వస్తున్నాయని, ఈసమయంలో సామూహికంగా ఎలుకల నిర్మూలన చేయడం వల్ల పంటకు నష్టం జరగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.

స్పందనలో మూడు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలకు సంబంధించి మూడు అర్జీలు అందాయని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ వివరించారు. తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

2న గూడెంలో సువార్తికుల సదస్సు

పెంటపాడు: చర్చిఆఫ్‌క్రైస్ట్ క్రిష్టియన్ థియాలజీ కళాశాల ఆధ్వర్యంలో అక్టోబర్ 2న సువార్తికుల ఆత్మీయ సదస్సు నిర్వహించనున్నట్లు బ్రదర్ రొక్కాల నాగబుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. క్రీస్తుసంఘంలో సువార్తికులుగా పనిచేసే వారందరూ అక్టోబర్ 2న సోమవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

ఘనంగా పట్టణంలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న యువనేత కొట్టు విశాల్, విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఆధ్వర్యంలో సోమవారం ఫార్మసిస్ట్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు కొట్టు విశాల్ హాజరైయారు. ఆయన మాట్లాడుతూ గూడెంకు ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ క్యాంపస్‌ను తీసుకువచ్చిన ఘనత డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు దక్కుతుందన్నారు. ఫార్మసీ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ హీరా బట్టు మాట్లాడుతూ ఔషధ వినియోగంతోనే మనిషి జీవితం మనుగడ ఆధారపడి ఉందని, ఔషధ రంగానికి, ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. ఔషధాల తయారీలో భారత్‌కు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, వైద్యరంగంలో డాక్టర్లు తర్వాత ఫార్మాసిస్టులకే అత్యధిక ప్రాధాన్యత ఉందని చెప్పారు. సభ అనంతరం ఫార్మసీ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, ఆదికవి యూనివర్శిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్, ఏరియా ఆసుపత్రి చిన్నపిల్లలు వైద్య నిపుణులు చైతన్య కుమార్, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వేల్పూరు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, తదితరులు

తణుకు టౌన్: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పంపన ఉషారాణి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల తణుకు బాలుర జిల్లా పరిషత్, ఎస్కేఎస్‌ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. అండర్ 14 విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు ఖోఖోలో ముగ్గురు, కబడ్డీలో ఇద్దరు, అథ్లెటిక్స్‌లో ఒక బాలిక ఎంపికైనట్లు తెలిపారు. అండర్ 17 విభాగంలో ఖోఖోలో ముగ్గురు, అథ్లెటిక్స్‌లో ఒకరు, హైజంప్‌లో ఒకరు, 2 కిలోమీటర్ల రన్నింగ్‌లో ఇద్దరు, యోగా పోటీల్లో నలుగురు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు కే సంధ్యారాణిని హెచ్‌ఎం, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బులివీరస్వామి, ఎం మునీంద్రరావు పాల్గొన్నారు.

అన్ని ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో సంచలనంగా మారిన స్కిల్ డవలప్‌మెంట్ కేసులో సిఐడీ అధికారులు పూర్తి ఆధారాలతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఎంతో మంది సామాన్య ఖైదీలు, వీఐపీలు ఉన్నా, అప్పట్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు సెంట్రల్ జైలులో వసతులు బాగోలేదని ఏనాడు చెప్పలేదని తెలిపారు. ఇప్పుడు చంద్రబాబు అదే జైలులోకి వెళ్లే సరికి వసతులు బాగోలేదని అనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సీఐడీ అరెస్టు చేస్తారనే భయంతో లోకేశ్ ఢిల్లీలో దాక్కున్నారని వెల్లడించారు. చంద్రబాబు బెయిల్‌పై వచ్చినా గానీ కేసులో సంబంధం ఉన్నవారందరూ లోకేష్, అచ్చంనాయుడు, తదితరులను అరెస్టు చేయడం ఖాయం అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.అబ్రహాం, దాసి మనోహర్, బీర సునీల్‌బాబు, బి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కడియద్ద సర్పంచ్‌ను పరామర్శించిన నాయకులు



కడియద్ద గ్రామ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామ సర్పంచ్ యాతం కోటీశ్వరి – బురయ్యలను సోమవారం జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముప్పిడి సంపత్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల బూరయ్య తండ్రి వెంకన్న మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను వారు అడిగి తెలుసుకున్నారు. వెంకన్న కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దారపురెడ్డి శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుతూ అభివృద్ధికి పాటుపడాలి

ఆకివీడు: సనాతన ధర్మాన్ని కాపాడుతూ ఆలయాల అభివృద్ధికి నూతన పాలక వర్గాలు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గ చైర్మన్‌గా గుర్రం హరనాథ్, డైరెక్టర్లతో దేవస్థానం ఈఓ ఎం.రఘునాథ్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సింహరాజు మాట్లాడుతూ చైర్మన్ హరనాథ్ ఆలయ అభివృద్ధికి కొన్నేళ్లుగా కృషిచేస్తున్నారని చెప్పారు. డైరెక్టర్లను కూడా ఆలయ అభివృద్ధికి చేస్తున్న సేవల్ని గుర్తించి నియమించినట్టు తెలిపారు. చైర్మన్ హరనాథ్ మాట్లాడుతూ పదవికి వన్నె తెచ్చే విధంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ, భక్తులకు సేవలందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే. రసూల్ బీబీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, తూర్పుకాపు డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, పెద్దింటి అమ్మ దేవస్థానం చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గల్ఫ్ వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి



గట్టిం మాణిక్యాలరావుకు వినతి పత్రం అందజేస్తున్న మొయ్యేరుకు చెందిన దాసి రమేష్

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్ వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కైండ్‌నెస్ సొసైటీ, ప్రవాస ఆంధ్రుల సేవా కేంద్రం అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు సూచించారు. గణపవరం మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన దాసి సుబ్బరాజు జీవనోపాధి కోసం డ్రైవర్ వృత్తి చేసేందుకు గల్ఫ్ వెళ్లగా అక్కడ ప్రమాదంలో మరణించారు. ఆయన మృతదేహాన్ని గ్రామానికి రప్పించేందుకు తగిన సహకారం అందించాలని సుబ్బరాజు బంధువులు దాసి రమేష్ తదితరులు సోమవారం తాడేపల్లిగూడెంలో ప్రవాస ఆంధ్రుల సేవా కేంద్రం కార్యాలయం వద్ద మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సుబ్బరాజు మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

అలరించిన ప్రవచనం

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయంలో చిలకలపూడి పాండురంగ ఆస్థాన దేవస్థానం గురువు, చాగంటి కోటేశ్వరరావు శిష్యుడు రవితేజ ప్రవచనం అలరించింది. సోమవారం ఆలయంలో శ్రీకృష్ణుని లీలలు, మహిమలను భక్తులకు ప్రవచించారు. భగవంతుని నమ్మి ప్రార్థించిన వారికి సుఖసంతోషాలు విరాజిల్లుతాయని ప్రవచించి భక్తులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.